క్లుప్తంగా

ఉచితంగా కంటి పరీక్షలు

అమరావతి: మండల పరిధిలోని మల్లాది గ్రామంలో శుక్రవారం శంకర కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరాన్ని క్రోసూరు మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ వెంపా జ్వాలా లక్ష్మీనరసింహరావు ప్రారంభించారు. శిబిరంలో 108 మందిని పరీక్షించగా 25 మందికి శుక్లాలు ఉన్నట్లు గుర్తించి శస్త్ర చికిత్సకు సిఫార్సు చేశారు. మిగిలిన వారిలో 45 మందికి కంటి సమస్యలు గుర్తించి వారికి కళ్లజోళ్లు వాడాలన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు


డి.ధర్మారావు


కాకర్ల గంగాధర్‌రావు

క్రోసూరు: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా మండలంలోని అందుకూరు గ్రామ జెడ్పీ పాఠశాల ఉపాధ్యాయులు ఇద్దరు అవార్డులు అందుకున్నారు. ఉపాధ్యాయులు దూసరి ధర్మారావు స్కూల్ అసిస్టెంట్(ఇంగ్లిషు), కాకర్ల గంగాధర్‌రరావు సెకండరీ గ్రేడ్ టీచర్‌లు అవార్డులందుకున్నారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు వచ్చినందుకు ఎంఈవోలు జి.కృష్ణ, గణేష్ , ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘం ఎస్టీయూ ఏపీ ప్రతినిధులు వారిని అభినందించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



రాజుపాలెం: మండల కేంద్రంలోని పులిచింతల నిర్వాసిత కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఫ్రైడే–డ్రైడే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య సిబ్బంది జ్వరాల సర్వే చేశారు. మురికి కాలువల్లో ఎబెట్ ద్రావణాన్ని పిచికారీ చేశారు. నీటితొట్టెలు, కొబ్బరి బొండాలలో నిల్వ ఉన్న నీటిని తొలగించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామస్తులకు తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ జీవన్‌రావు, మలేరియా హెల్త్ అసిస్టెంట్ షరీఫ్, ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎమ్‌లు తదితరులు పాల్గొన్నారు.

మసీదుల్లో భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు



రాజుపాలెం: మండలంలోని రెడ్డిగూడెంలో ముస్లిం సోదరులు మిలాద్ ఉన్ నబీ పండుగ సందర్భంగా గ్రామంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. మహ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా భారీ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా హిమాం మాట్లాడుతూ.. మహా ప్రవక్త వచనం మనకు ప్రవచనం అని తెలిపారు. కార్యక్రమంలో ముస్లిం యువత, మసీదు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ముప్పాళ్ళ: మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా జరుపుకొనే మిలాద్ ఉల్ నబీ పర్వదినాన్ని ముస్లిం సోదరులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సామూహిక ప్రార్థనల్లో మతపెద్దలు పాల్గొని పండుగ ప్రత్యేకతను, మహమ్మద్ ప్రవక్త సూక్తులను వివరించారు.

నేటి చలో విజయవాడ జయప్రదం చేయండి

నరసరావుపేట: విద్యారంగ సమస్యల పరిష్కారానికై ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం నిర్వహించే చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ కె.సాయికుమార్ పిలుపునిచ్చారు. పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.6400 కోట్లు వెంటనే విడుదల చేయాలని, జీఓ నం.77 రద్దు చేసి పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అందజేయాలని డిమాండ్ చేశారు. సంక్షేమ హాస్టల్లో ఉంటూ చదువుకునే విద్యార్థులకు నెలకు రూ.3 వేలు మెస్ చార్జీలు పెంచి పెండింగ్‌లో ఉన్న మెస్ చార్జీలను వెంటనే విడుదల చేయాలని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు విద్యార్థులకు ఇచ్చిన హామీలు అధికారంలోకి వచ్చాక అమలు చేయక పోవడం సిగ్గుచేటన్నారు.

సేవకు ప్రతిరూపం మదర్ థెరిస్సా

చిలకలూరిపేట: సేవకు ప్రతిరూపం మదర్‌థెరిస్సా అని డాక్టర్ సతీష్‌చంద్ర చెప్పారు. ఏపీ స్టేట్ ప్రైవేట్ కాంపౌండర్లు, నర్సుల అసోసియేషన్ ఆధ్వర్యంలో మదర్‌థెరిస్సా వర్ధంతి శుక్రవారం నిర్వహించారు. ముందుగా రైతుబజార్ ఎదురుగా ఉన్న మదర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కొండ్రముట్ల నాగేశ్వరరావు, దేవరకొండ నాగేశ్వరరావు, బి.శ్రీను నాయక్, గుంజి బాల సుబ్రమణ్యం పాల్గొన్నారు.

గురువులు.. సమాజ మార్గదర్శకులు

- వాడవాడలా గురుపూజోత్సవాలు
- పలువురు ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం

సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల్లోని విద్యాలయాల్లో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ.. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో గొప్పదన్నారు. ఉపాధ్యాయుడు స్థాయి నుంచి రాష్ట్రపతి స్థాయికి ఎదిగిన సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆదర్శ ప్రాయుడన్నారు.

సత్తెనపల్లి: సమాజానికి దిశ, దశ చూపే దిక్సూచి గురువులని జిల్లా అగ్నిమాపక అధికారి కాపు సత్యనారాయణ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఐఎంఏ హాల్లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సభకు లయన్స్‌క్లబ్ సత్తెనపల్లి టౌన్ అధ్యక్షుడు బండ్లమూడి వీరాంజనేయులు అధ్యక్షత వహించారు. మండల విద్యాశాఖాధికారి–1 ఏ.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దే అవకాశం ఒక్క ఉపాధ్యాయులకు మాత్రమే ఉందన్నారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన బీసీహెచ్ వెంకటేశ్వరరాజు, కొండవీటి శాంతకుమారి, కన్యదారి ఆనందరావు, బొమ్మన బోయిన హృదయరాజు, షేక్ నాగుల్ షరీఫ్, ఆరిక శ్రీరామిరెడ్డి, తోట శ్రీనివాసరావు, మిట్టపల్లి గీతాంజలి, కన్నా మంజుల, తురకా రాజు, మంగెనపూడి శ్రీకాంత్‌లను సత్కరించారు. వ్యాఖ్యాతలుగా లయన్ మంచికంటి వెంకటేశ్వరరావు, లయన్ వైపీ మురళీకృష్ణ వ్యవహరించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ సత్తెనపల్లిటౌన్ కార్యదర్శి లయన్ ఎం.రమేష్‌బాబు, కోశాధికారి లయన్ బి.రోశయ్య, ప్రోగ్రాం చైర్మన్ కర్నాటి వెంకటరెడ్డి, తదితరులు ఉన్నారు.

వాసవి మణికంఠ క్లబ్ ఆధ్వర్యంలో..

దేశ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని రిటైర్డ్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ గోపినాయక్ అన్నారు. వాసవి మణికంఠ క్లబ్ సత్తెనపల్లి ఆధ్వర్యంలో పట్టణంలోని పెన్షనర్స్ అసోసియేషన్ హాల్‌లో ఉపాధ్యాయులు కాకరపర్తి శ్రీనివాసరావు, కుంభా ఏడుకొండలు, అరవ సుధీర్‌పీటర్ పాల్, కాసరబాద నాగేశ్వరరావు, నెమలికంటి అరుణ, గుడిపూడి ప్రభాకర్, మాతంగి సాంబశివరావు, బెల్లంకొండ నాగసాయిప్రసాద్‌లను శుక్రవారం సన్మానించారు. కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్‌హాల్ ప్రధాన కార్యదర్శి కేబీఆర్ జె.ప్రసాద్, జేపీఎస్ శాస్త్రి, బంకా వాసుబాబు, ఎస్.ప్రసాద్‌రాజు, క్లబ్ అధ్యక్షుడు కొప్పురావూరి కాశీ వెంకట సుబ్బారావు, సెక్రటరీ సూరె శ్రీనివాసరావు, ట్రెజరర్ దేవరపల్లి కాశీవిశ్వేశ్వరరావు, జోన్ చైర్మన్ వనమా నాగేశ్వరరావు, కుంభా వీరాంజనేయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, పాల్గొన్నారు.

అమరావతి సేవ సమితి ఆధ్వర్యంలో..

ఉత్తమమైన వ్యక్తిని తయారు చేయడమే విద్య పరమార్థమని అమరావతి సేవ సమితి అధ్యక్షుడు గొల్లపల్లి వీరాంజనేయులు అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా అమరావతి సేవ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం ఉపాధ్యాయులు గుండ్లపల్లి కృష్ణ, కేబీఆర్‌జే ప్రసాద్, అరవ సుధీర్ పీటర్‌పాల్‌లను సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాగమలేశ్వరావు, షారోన్, బాలాజీ నాయక్, బబ్బు, తదితరులు పాల్గొన్నారు.


సత్కారం అందుకున్న ఉపాధ్యాయులతో డాక్టర్ గోపీనాయక్


ఉపాధ్యాయుడిని సత్కరిస్తున్న అమరావతి సేవా సమితి బాధ్యులు


విశ్రాంత ఉపాధ్యాయుడు కేబీఆర్‌జే ప్రసాద్ సత్కారం

లోక్ జనశక్తి పార్టీ ఆధ్వర్యంలో..

ఎంతో మంది విజ్ఞాన శిల్పాలను తయారు చేయడంలో విశ్రాంత దివ్యాంగ ఉపాధ్యాయులైన యనమాల ప్రభాకరావు, షేక్ మహబూబ్ తమ వంతుగా కృషి చేశారని లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్) జిల్లా అధ్యక్షుడు జొన్నలగడ్డ విజయ్‌కుమార్ అన్నారు. ఈ సందర్భంగా వారిని పలువురు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు కారుమంచి గంగరాజు, కొరబండి ఆంథోనీ, రాబర్ట్, షేక్ సుభాని, కరిముల్లా, సరికొండ రమాదేవి పాల్గొన్నారు.

సర్వేపల్లిని ఆదర్శంగా తీసుకోవాలి..

బెల్లంకొండ: విద్యార్థులు సర్వేపల్లిని ఆదర్శంగా తీసుకోవాలని గ్రేస్ మహిళా మండలి అధ్యక్షురాలు దుగ్గి కీర్తన తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో గ్రేస్ మహిళా మండలి ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. చిన్నతనం నుంచే విద్యార్థులు ఉత్తమ విలువలతో కూడిన విద్యాభ్యాసం చేయాలని ఆమె తెలిపారు. కార్యక్రమంలో పాస్టర్ దుగ్గి సామేలు, మహిళా మండలి సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

రాజుపాలెం: మండలంలోని కోటనెమలిపురి జిల్లా పరిషత్ పాఠశాలలో ఆయుష్ డాక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులను గ్రామ పెద్దలు ఏ.బాలిరెడ్డి, ఎస్.కోటిరెడ్డి, ఎం.వెంకటరమణ, ఆయుష్ డాక్టర్ శ్రీనివాస్‌లు కలిసి సత్కరించారు. కార్యక్రమంలో ప్రాధానోపాధ్యాయురాలు శైలజ, ఉపాధ్యాయులు అచ్చమ్మ, సాంబయ్య, ఆంజనేయులు, శాంతి, శ్రీభవానిదేవి, జయశ్రీ, స్వరూపరాణి, పెద్దమ్మాయి, హనుమంతరావు, నాగరాజకుమారి, హెచ్‌ఎం అరుణకుమారి, బాబు, కోటేశ్వరమ్మ, తదితరులు ఉన్నారు.

అమరావతి: స్థానిక శ్రీరామకృష్ణ హిందూ హైస్కూల్‌లో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. పాఠశాల పాలకవర్గ సభ్యుడు భువనగిరి సాయిబాబు మాట్లాడారు. అనంతరం ఉపాధ్యాయుడు నారాయణను సత్కరించారు. స్థానిక సరస్వతి శిశు మందిరం విద్యార్థుల ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయుడు శనగవరపు రామ్మోహన శర్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కోలా వెంకటేశ్వరరావులను ఘనంగా సత్కరించారు.


దివ్యాంగ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న విజయ్‌కుమార్


కోటనెమలిపురి జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలలో..

ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక..

అచ్చంపేట: డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా అచ్చంపేట మండలం నుంచి ఇరువురు ఉపాధ్యాయులు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైయ్యారు. వీరు శుక్రవారం నర్సరావుపేటలో పల్నాడు జిల్లా కలెక్టరు అరుణబాబు నుంచి అవార్డుతో పాటు షీల్డు తీసుకున్నారు. ఎంపికైన వారిలో మండలంలోని కోనూరులో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఎల్‌ఎఫ్‌ఎల్‌హెచ్‌యంగా పనిచేస్తున్న గంధం గంగయ్య, నీలీశ్వరపాలెం ఎంపీపీ స్కూలులో ఎస్జీటీగా పనిచేసే నంద్యాల శివకుమారిలు ఉన్నారు. ఇరువురి ఉపాధ్యాయును తోటి ఉపాధ్యాయులు సత్కరించారు.

బొల్లవరం(ముప్పాళ్ళ): మండలంలోని బొల్లవరం ఎంపీపీ పాఠశాలలో సర్వేపల్లి జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఎం.సురేష్, పాలడుగు సుబ్బారావు, గ్రామస్థులు పాల్గొన్నారు.

డాక్టర్ సర్వేపల్లికి గజ్జల నివాళులు..


నివాళులు అర్పిస్తున్న డాక్టర్ గజ్జల

నరసరావుపేట: సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవరెడ్డి శుక్రవారం నరసరావుపేటలోని సత్తెనపల్లి నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. దేశంలో విద్యావ్యాప్తికి సర్వేపల్లి చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.


సత్కార కార్యక్రమంలో ఉపాధ్యాయుడు నారాయణ


ఎంపికైన ఉత్తమ ఉపాధ్యాయులు


బొల్లవరం ఎంపీపీఎస్‌లో ఉపాధ్యాయ దినోత్సవం..

మానసిక దివ్యాంగులకు చేయూతనివ్వాలి



సత్తెనపల్లి: పుట్టుకతోనే మానసిక దివ్యాంగులుగా జన్మించిన చిన్నారులకు ప్రతి ఒక్కరూ చేయూతను అందించాలని వట్టిచెరుకూరు ఎంపీపీ చిలకా సుబ్బారావు అన్నారు. పట్టణంలోని పరివర్తన చెవిటి, మూగ, మానసిక దివ్యాంగుల ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం ఆయన జన్మదిన వేడుకలు పట్టణానికి చెందిన చిలకా రమణయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ హానక్ కేక్ కట్ చేసి అన్నసంతర్పణను ప్రారంభించారు. సుబ్బారావు మాట్లాడుతూ.. తన పేరు మీద దివ్యాంగులకు అన్నసంతర్పణ ఏర్పాటు చేసిన రమణయ్యను అభినందించారు. కార్యక్రమంలో మదర్ థెరిస్సా సేవా సంస్థ అధ్యక్షుడు చిలుకా జాన్సన్, పరివర్తన నిర్వాకుడు కె.కిషోర్, నాయకులు ఎం.ఈశ్వర్, బందారు రవి, మాబు, పెద్దింటి నాగేశ్వరరావు, రామారావు, దీపాల పరంధామయ్య, ప్రకాష్‌రావు, పచ్చల ఆనంద్, డాక్టర్ రాయపూడి వెంకటేశ్వరరావు, చిలక ఏసుబాబు, పందిటి రామారావు, తదితరులు పాల్గొన్నారు.

యూరియా పంపిణీ పరిశీలన



క్రోసూరు: క్రోసూరు మార్కెట్ యార్డు డీసీఎంఎస్ కేంద్రంలో రైతులకు పంపిణీ చేస్తున్న యూరియాను మండల వ్యవసాయ అధికారి వేణుగోపాల్ శుక్రవారం పరిశీలించారు. అనంతరం ఆయన రైతులతో మాట్లాడారు. మండలంలో డీసీఎంఎస్, పీఏసీఎస్, రైతు సేవా కేంద్రాలు, ప్రైవేటు డీలర్ల ద్వారా రైతులకు యూరియా.. కాంప్లెక్స్ ఎరువులను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. రైతులు పంట కాలానికి సరిపడే మొత్తం యూరియాను ఒకేసారి కొనుగోలు చేయడం వల్ల మిగిలిన రైతులకు అందడం లేదని.. రైతులు ప్రస్తుతం పంటకు అవసరం అయ్యే యూరియా మాత్రమే కొనుగోలు చేయాలని కోరారు. యూరియా పంపిణీ విషయంలో రైతులు అధికారులకు సహకరించాలని కోరారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

నాదెండ్ల: మండల సర్వసభ్య సమావేశం శనివారం ఎంపీపీ తలతోటి రాణి అధ్యక్షతన జరగనున్నట్లు ఎంపీడీవో స్వరూప రాణి తెలిపారు. ఉదయం 11 గంటలకు జరిగే సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు హాజరుకావాలని కోరారు.

ఏజీకేఎం వాకర్స్ క్లబ్ అధ్యక్షుడిగా కాపుగంటి

సత్తెనపల్లి: పట్టణంలోని ఏజీకేఎం వాకర్స్ క్లబ్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన కాపుగంటి శ్రీ వెంకటరత్నం(రత్తయ్య)ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని ఏజీకేఎంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఈ ఎన్నికను నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. ఆరోగ్యమే మహా భాగ్యమని, అలాంటి ఆరోగ్యం చక్కగా ఉండాలంటే నడక తప్పనిసరి అని అన్నారు. అలాంటి అసోసియేషన్‌కు రత్తయ్య ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా అసోసియేషన్ సభ్యులు పుట్టి సాంబశివరావు, మిత్రులు ఆయనను ప్రత్యేకంగా అభినందించారు. గుంటూరు జిల్లా ఆర్య వైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు పెరుమాళ్ల లక్ష్మీశివనారాయణ రత్తయ్యను పూలమాలలు, దుశ్శాలవాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆర్య వైశ్య నాయకులు పోతుగంటి రామ కోటేశ్వరరావు, నరసింహారావు, దివ్వెల శ్రీనివాసరావు, కోనంకి మారుతి, దేవిశెట్టి శరత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.


రత్తయ్యను సత్కరిస్తున్న అసోసియేషన్ బాధ్యులు

అంతర్జాతీయ అవార్డు గ్రహీతకు ఘనసన్మానం

నరసరావుపేట రూరల్: అంతర్జాతీయ గౌరవ పురస్కారం అందుకున్న ఎఎంరెడ్డి విద్యా సంస్థల కార్యదర్శి అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డిని శుక్రవారం ఘనంగా సత్కరించారు. లండన్ ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో ఆగస్టు 31వ తేదీన 14వ వరల్డ్ లీడర్స్ సమ్మిట్ అవార్డు ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అవుట్ స్టాండింగ్ లీడర్ అవార్డు ఇన్ లీడర్‌షిప్ అవార్డును శాంతి శ్రీనివాసరెడ్డి అందుకున్నారు. విద్యారంగంలో అసాధారణ నాయకత్వ లక్షణాలు, ప్రగతిశీల ఆలోచనలు, సంస్థల ఉన్నతికి చేస్తున్న కృషికి ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ఈ అవార్డు ప్రదానం చేసింది. ఈ సందర్భంగా కళాశాలలో శాంతి శ్రీనివాసరెడ్డి అభినందన కార్యక్రమం నిర్వహించారు. విద్యాసంస్థ పరిధిలోని ప్రిన్సిపల్స్, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని ఆమెను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శాంతి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ విద్య అనేది కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా విలువలు, సృజనాత్మకత, సామాజిక బాధ్యతలతో ముడిపడి ఉండాలన్నారు. విద్యార్థులను అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడే స్థాయిలో తీర్చిదిద్దడమే ఎఎంరెడ్డి విద్యా సంస్థల లక్ష్యమని తెలిపారు.


శాంతి శ్రీనివాసరెడ్డిని సత్కరిస్తున్న అధ్యాపకులు

వృద్ధ దంపతులకు చేయూత

నూజెండ్ల: మండలంలోని అప్పాపురం గ్రామం ఎస్సీ కాలనీలో తూమాటి నాగయ్య–పున్నమ్మ 70 సంవత్సరాల కల్గియున్న దంపతులు జీవనోపాధి చేసుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవారం అరుంధతీ సేవా ఫౌండేషన్ సారధ్యంలో 50 కేజీలు బియ్యం నిత్యావసర వస్తువులు, కూరగాయలు పంపిణీ చేసినట్లు ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు దాసరి కోటేశ్వరరావు తెలిపారు. గత 15 సంవత్సరాల నుంచి ఫౌండేషన్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేసినట్లు తెలిపారు. అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన బాధిత కుటుంబాలను కూడా తమ వంతు సహకారం అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉప అధ్యక్షులు గర్నెపూడి ఈశ్వరయ్య,తదితరులు పాల్గొన్నారు.

శివనాగేంద్రమ్మకు మాజీమంత్రి నివాళులు

నాదెండ్ల: వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మద్దూరి కోటిరెడ్డి మాతృమూర్తి శివనాగేంద్ర మ్మ (75) అనారోగ్యంతో మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న మాజీ మంత్రి విడదల రజిని, సంతనూతలపాడు మాజీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు తూబాడులోని కోటిరెడ్డి నివాసానికి వెళ్లి నివాళులు అర్పించారు. పలువురు పార్టీ జిల్లా, మండల నాయకులు సంతాపం తెలిపారు.

ఆటో డ్రైవర్లకు జీవనోపాధి కల్పించాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న వేణుగోపాల్

సత్తెనపల్లి: స్త్రీ శక్తి పేరుతో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఉపాధి కోల్పోయిన ఆటో డ్రైవర్లకు రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలో ఉద్యోగాలు ఇచ్చి ఆటో డ్రైవర్లకు జీవనోపాధిని కల్పించాలని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) సత్తెనపల్లి ఏరియా సమితి గౌరవ అధ్యక్షుడు నరిశేటి వేణుగోపాల్ విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని అమరావతి ఆటో పాయింట్‌లో శుక్రవారం ఆటో యూనియన్ కరపత్రాలు ఆవిష్కరణ సభలో ఆయన ముఖ్యఅతిథిగా హజరై మాట్లాడారు. ఆర్టీసీలో కండక్టర్లు, డ్రైవర్లు, మెకానిక్ పోస్టులు రవాణా శాఖ, ఆర్ అండ్ బీ, మున్సిపల్ ఆఫీసుల్లో అటెండర్స్, ఆఫీస్ బాయ్స్‌గానూ, పోలీస్ హోంగార్డు ఉద్యోగాలు ఇచ్చి డ్రైవర్ల కుటుంబాలను ఆదుకోవాలన్నారు. ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు కంబాల శ్రీనివాస్ మాట్లాడుతూ.. డ్రైవర్ల హక్కుల సాధనకు పోరాటాలు చేసి ప్రభుత్వాల కళ్లు తెరిపించాలన్నారు. డ్రైవర్ల డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు షేక్ మహబూబ్, డి.బాబు, ఏ.రమేష్, చిలక జిప్సను, శీను, మేకా కోటేశ్వరరావు, చెన్నారావు, కిరణ్, రామయ్య, జాను, శంకర్, కె.శ్రీనివాసు, తదితరులు పాల్గొన్నారు.

రెంటపాళ్లలో జనసేన నాయకుడి ఆగడాలు

సత్తెనపల్లి: మండలంలోని రెంటపాళ్ల గ్రామంలో జనసేన మండల పార్టీ అధ్యక్షుడు రామ సైదులు ఆగడాలు శృతిమించాయని సోషల్ మీడియాలో శుక్రవారం వైరల్ అయ్యాయి. గురువారం రాత్రి వినాయక నిమజ్జనం సందర్భంగా ప్రసాదాల పంపిణీ సమయంలో గ్రామానికి చెందిన తీర్థాల కృష్ణ అనే యువకుడు ఇంటి మీద దాడికి పాల్పడినట్లు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం పేరు చెప్పి దాడులు చేస్తున్నారని.. కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండటంతో అధికారులు కూడా పట్టించు కోకపోవడంతో ఆగడాలు ఎక్కువైనట్లు విమర్శించారు. సోషల్ మీడియాలో ఇది వైరల్ కావడంతో సత్తెనపల్లి రూరల్ పోలీసులు ఇరువర్గాలతో గొడవలు లేకుండా ఉండాలని చర్చలు జరుపుతున్నట్లు సమాచారం.

ఘనంగా ప్రవక్త జన్మదినం

చిలకలూరిపేటటౌన్: ఇతరుల పట్ల దయ, కరుణ, న్యాయం, నిజాయితీతో వ్యవహరించాలన్న మొహమ్మద్ ప్రవక్త బోధనలు సర్వ మానవులకు ఆచరణీయమని మౌలానా షేక్ బాజీషహిద్ చెప్పారు. మండలంలోని పసుమర్రు గ్రామంలోని చినమసీదు బజారులోని శుక్రవారం మిలాద్ ఉన్ నబీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జెండాచెట్టు వద్ద ఏర్పాటు చేసిన ఈ వేడుకల్లో ఆయన పాల్గొని మొహమ్మద్ ప్రవక్త (సఅసం) జన్మదినాన్ని ఈ మాసమంతా ముస్లింలు వాడవాడలా ఎంతో ఘనంగా నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. చినమసీదు వీధిలోని ముస్లిం కుటుంబాలు ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలు సమిష్టిగా చేయడం ఐదో ఏటా నిర్వహించుకోవడం అభినందనీయం అన్నారు. వివిధ పుష్పాలు, సుగంధ ద్రవ్యాలతో సర్వాంగ సుందరంగా మండపంలో మొహమ్మద్ జీవిత విశేషాలను గురించి ఆయన బోధించి దువా చేశారు.


దువా చేస్తున్న మౌలానా షేక్ బాజీషహిద్

బాబు వినాశకర విధానాలు తిప్పికొట్టాలి

నరసరావుపేట: ముఖ్యమంత్రి చంద్రబాబు వినాశకర ప్రైవేటీకరణ విధానాలను త్రిప్పికొట్టి పబ్లిక్ రంగాన్ని కాపాడుకునేందుకు వైఎస్సార్‌సీపీ, వామపక్ష పార్టీలు, అన్నీ ప్రతిపక్షా లు, అభ్యుదయ ప్రజా సంఘాలు సుదీర్ఘ పోరాటానికి సమాయత్తం కావాలని సోషల్ యాక్టి విస్టు ఈదర గోపీచంద్ పిలుపు ఇచ్చారు. శుక్రవారం పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఎందరో ఆంధ్రుల త్యాగాలతో సాధించుకున్న విశాఖ ఉక్కు ఫ్యాక్ట రీ రెక్కలను విరిచి, కాళ్లు తెగ్గొట్టి ఇక ప్రైవేటు వారికి విసిరిపారేయటమే తరువా యిగా ఉన్న భీతావహ దుస్థితిని తెచ్చి, ఇంకా ఏమీ జరగ లేదు అన్నట్టు బుకాయించడం చంద్రబాబు మోసపూరిత వైఖరికి పరాకాష్ట అన్నారు. ఇదేవిధంగా వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి హయాంలో నిర్మాణం తుది దశలో ఉన్న పది మెడికల్ కళాశాలలను ప్రైవేట్ పరం చేస్తూ, పేదలకు వైద్యాన్ని, పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేయడానికి తెగబడిన బాబు విధానం కక్షపూరితంగా, ప్రజా వ్యతిరేకంగా, పీపీపీ పేరున తన బినామీ దారులకు ప్రైవేటు పెత్తందారులకు దోచిపెట్టే విధంగా ఉందన్నారు. ఇందుకు తగిన నిర్ణయాలను ఈ నెల 9న ఆయా పక్షాలు తీసుకోవాలని, లేనిచో చరిత్ర క్షమించదని అన్నారు.